సాక్షి
అనంతపురం

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



టమాట కిలో రూ.21

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాటా గరిష్ట ధర రూ.21 పలికింది.



ఏఎస్ఐలుగా పదోన్నతి

ఉమ్మడి జిల్లాలో 37 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి దక్కింది. ఈమేరకు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు.



జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఏఎస్పీ కార్యాలయానికి బందోబస్తు



ఏఎస్పీ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయం వద్ద బుధవారం వందలాది మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గత నెల 31న పట్టణంలో నిర్వహించిన వినాయక విగ్రహాల శోభాయాత్రలో టీడీపీ నాయకులు జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్ వర్గాలు రాళ్లు రువ్వుకున్న ఘటనలో ఇరు వర్గాలకు చెందిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకర్ రెడ్డి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తన ఇంటి వద్దకు రావాలని వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం రావడంతో బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, అనివార్య కారణాలతో ఆందోళన కార్యక్రమం వాయిదా పడిందని జేసీ వర్గీయులు చెప్పడం గమనార్హం. ఒక్కసారిగా ఏఎస్పీ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో పోలీసులు చేరుకోవడంతో తాడిపత్రి పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు.

22 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 22 మండలాల పరిధిలో 4.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కళ్యాణదుర్గం 17.2 మి.మీ, కంబదూరు 15.4, నార్పల 11.6, విడపనకల్లు 11.2, ఉరవకొండ 10.6, కుందుర్పి 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 12.9 మి.మీ నమోదైంది. ఓవరాల్‌గా జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకు 218 మి.మీ గానూ 20 శాతం అధికంగా 261.4 మి.మీ నమోదైంది. 21 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కాగా... 17 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా, 10 మండలాల్లో సాధారణం, మిగతా 4 మండలాల్లో తక్కువగా వర్షపాతం నమోదైంది.

సీఎం పర్యటన ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ జగదీష్

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 10న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో ఉన్న జీఎంఆర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఏర్పాట్లను సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెలీప్యాడ్, సభాస్థలి, పార్కింగ్, తదితర ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, ఆర్డీఓ కేశవనాయుడు పాల్గొన్నారు.

ఆ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

రాయదుర్గం: తప్పతాగి విధులకు హాజరైన ఉద్యోగిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వివరాలు.. రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన రేడియోగ్రాఫర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మదన్‌కుమార్ మంగళవారం పూటుగా మద్యం సేవించి ఆస్పత్రికి వచ్చాడు. ఇష్టారాజ్యంగా ప్రవర్తించాడు. మదన్ కుమార్ వ్యవహారంపై కలెక్టర్ వినోద్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు డీసీహెచ్ఎస్ బుధవారం రాయదుర్గం ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. సూపరింటెండెంట్ మెర్జీ జ్ఞానసుధతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రేడియోగ్రాఫర్ తీరుపై కలెక్టర్ సీరియస్ అయ్యారన్నారు. సస్పెండ్ చేసి విచారణ చేయాలని ఆదేశించారన్నారు. వ్యక్తిగత సమస్యలతో మద్యం సేవించాల్సి వచ్చిందని సదరు రేడియోగ్రాఫర్ చెప్పాడన్నారు. ఈ విషయంపై నివేదికను కలెక్టర్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీలను లెక్కచేయని శాసనసభ్యులు

- అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలూ చేపట్టకూడదని హుకుం
- ఇటీవల ఎంపీ అంబికాతో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ఢీ
- శింగనమలలో ఎంపీపై టీడీపీ కార్యకర్తల తిరుగుబాటు
- పెనుకొండలో మరీ ఘోరంగా ఎంపీ పార్థసారథి పరిస్థితి
- ఆవేదనలో ఎంపీల అనుచరులు
- టీటీడీ లెటర్లకు తప్ప ఎందుకూ ఉపయోగపడటం లేదని నిట్టూర్పు



ఆధిపత్య పోరులో ఆటబొమ్మలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఇప్పటికే రోజుకో నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు, కింది స్థాయి కేడర్‌కు మధ్య రచ్చ జరుగుతూనే ఉంది. ఇప్పుడు ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య పోరు పతాక స్థాయికి చేరినట్లు తెలిసింది. ఏ నియోజకవర్గంలో అయినా సరే ఎంపీ మాట నెగ్గే పరిస్థితి లేదు. ఒకవిధంగా చెప్పాలంటే ఎంపీలు డమ్మీలుగా మారారని, ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని టీడీపీ నాయకులే పెదవి విరుస్తున్నారు. టీటీడీ లెటర్లు ఇవ్వడానికి మినహా దేనికీ పనికిరావడం లేదంటున్నారు.

మా అనుమతి లేనిదే..

ఎలాంటి అనధికార కార్యక్రమాలకూ తమకు తెలియకుండా ఎంపీలు వెళ్లడానికి వీల్లేదంటూ ఎమ్మెల్యేలు హుకుం జారీచేశారు. తాజాగా అనంతపురం అర్బన్‌లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాతూరు మార్కెట్ పరిశీలనకు వెళ్లినప్పుడు ఎమ్మెల్యేకు, ఎంపీకి తీవ్ర వాగ్వాదం జరిగింది. 'నా అనుమతి లేకుండా వెళ్లడానికి మీరెవరు' అంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి విరుచుకుపడినట్టు తెలిసింది. తాడిపత్రి, గుంతకల్లు, ధర్మవరం, కదిరి వంటి నియోజకవర్గాలు ఎలా ఉన్నాయో కూడా ఎంపీలకు తెలియదు! నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టులు కానీ, కేటాయింపులు చేసే అధికారాలు కూడా ఎంపీలకు లేవు. ఏ నియోజకవర్గంలో అయినా ఎమ్మెల్యేలే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. ఇసుక, మట్టి, మద్యం ఇలా ఏదైనా కానీ ఎంపీలకు దక్కడానికి వీల్లేకుండా చేశారు. 'పేరుకే ఎంపీ.. అంతా ఎంప్టీ' అన్న చందాన తయారైంది పరిస్థితి. ఇటీవల శింగనమల నియోజకవర్గంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తమకొద్దంటూ టీడీపీ కార్యకర్తలే ధర్నా చేయడం సర్వత్రా చర్చకు దారి తీసింది.

ఆయనకు అడుగడుగునా..

హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చివరి నిమిషంలో ఇచ్చింది చాలు అన్నట్టు ఎంపీ సీటు దక్కించుకుని గెలిచినా.. ఉమ్మడి జిల్లాలో ఆయన మాట ఎక్కడా చెల్లుబాటు కావడం లేదు. ఇక.. సొంత నియోజకవర్గం పెనుకొండలో అయితే మంత్రి సవితకు, ఎంపీకి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి. ఏ పనిలోనూ ఎంపీకి చిన్న భాగస్వామ్యం కూడా లేదు. కదిరి, హిందూపురం, ధర్మవరం, రాప్తాడు ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ పార్థసారథి మాట చెల్లుబాటు కావడం లేదని ఆయన వర్గీయులు వాపోతున్నారు.

బదిలీల్లో ఘోర పరాభవం

ఇటీవల జరిగిన బదిలీల్లో ప్రభుత్వ సిబ్బందికి ఇచ్చిన సిఫార్సు లేఖల్లో ఎంపీల సిఫార్సు లేఖలు బుట్టదాఖలయ్యాయి. నియోజకవర్గంలో తమ సిఫార్సు కాదని ఎంపీల సిఫార్సు లేఖలు తీసుకోవద్దంటూ అధికారులకు ఎమ్మెల్యేలు హుకుం జారీచేశారు. చివరకు ఎంపీ ల్యాడ్స్ కింద పనులు చేసినా తమ నియోజకవర్గంలో జరుగుతున్నాయి. కాబట్టి తమకు వాటా దక్కాల్సిందేనని పట్టుపడుతున్నారు. ఈ క్రమంలో బయటకు చెప్పుకోలేక, ఎమ్మెల్యేలను ఎదుర్కొనే శక్తి లేక ఎంపీలు లోలోపల కుమిలిపోతున్నారు. ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసినా అధిష్టానం పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో నలిగిపోతున్నారు. తమకంటే నామినేటెడ్ పోస్టులు దక్కించుకుంటున్న వారే నయమని ఎంపీలు సన్నిహితులతో వాపోతున్నారు.

రెచ్చిపోయిన ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్

- డాక్యుమెంటు రైటర్ అసిస్టెంట్‌పై చేయిచేసుకున్న వైనం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్ రెచ్చిపోయారు. ఓ డాక్యుమెంటు రైటర్ అసిస్టెంట్‌పై చేయి చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తెలిపిన మేరకు.. ఎనీవేర్ (ఎక్కడైనా) రిజిస్ట్రేషన్ పరిశీలనకు ఏసీబీ అధికారులు బుధవారం స్థానిక అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అంతకు రెండు రోజులు ముందే ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్ ఒక స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందు కోసం డాక్యుమెంటు రైటర్ మురళి రూ.6,500 తీసుకున్నారు. ఈ క్రమంలోనే బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన హమీద్‌ఖాన్ డాక్యుమెంటు రైటర్‌కు ఫోన్ చేసి తన దగ్గరే ఎక్కువగా డబ్బు తీసుకుంటారా అని గద్దించారు. ఇందుకు డాక్యుమెంట్ రైటర్ మురళి బదులిస్తూ డాక్యుమెంటును బట్టి చార్జీలుంటాయని సమాధానమిచ్చారు. దీంతో కోపోద్రిక్తుడైన సీఐ హమీద్‌ఖాన్ అక్కడే ఉన్న డాక్యుమెంటు రైటర్ అసిస్టెంట్ కార్తీక్‌పై చేయి చేసుకున్నారు. ఏసీబీ సీఐ దురుసు ప్రవర్తనపై డాక్యుమెంటు రైటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైటర్ నచ్చకపోతే వేరే దగ్గర చేయించుకోవాలి గానీ, ఎక్కువ తీసుకున్నారని కొట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపిక



అరుణ



శ్రీనివాసులు



శైలజ

అనంతపురం ఎడుకేషన్/ కల్చరల్: రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు జిల్లాకు చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. ఆత్మకూరు జెడ్పీ హెచ్ఎస్‌లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్న శైలజ, గుత్తి మండలం అబ్బేదొడ్డి జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు, పామిడి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణను ప్రభుత్వం అవార్డులకు ఎంపిక చేసింది. సెప్టెంబర్ 5న విజయవాడలో జరగనున్న గురుపూజోత్సవం కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

- అవార్డుకు ఎంపికైన బయాలజీ టీచర్ శైలజ 1996లో పోస్టుకు ఎంపికయ్యారు. అనంతపురం రూరల్ విద్యారణ్యనగర్ పాఠశాలలో వృత్తి జీవితం ప్రారంభించారు. చిన్నారుల్లో అంతర్లీనంగా ఉండే ప్రతిభా పాటవాలను గుర్తిస్తూ ప్రోత్సహిస్తున్నారు. గతంలో ఉరవకొండ పాఠశాలలో శైలజ పని చేసిన సమయంలో విద్యార్థులు రెండు సార్లు జాతీయ స్థాయి సైన్సు కాంగ్రెస్‌కు ఎంపిక కావడం గమనార్హం. గంగవరంలో పని చేసిన సమయంలోనూ విద్యార్థులు సైన్సు కాంగ్రెస్‌కు వెళ్లినట్లు తెలిసింది. శైలజకు రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ రావడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.
- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఫిజిక్స్ టీచర్ శ్రీనివాసులు 1996లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 16 ఏళ్లుగా డిజిటల్ పద్ధతిలో తరగతులు బోధిస్తున్నారు. 15 ఏళ్లు రిసోర్స్ పర్సన్‌గా కూడా విధులు నిర్వర్తించారు. అవార్డుకు ఎంపికైన శ్రీనివాసులుకు పలువురు టీచర్లు అభినందనలు తెలిపారు.
- పామిడి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ విద్యార్థులను అమ్మలా ఆదరిస్తూ బోధిస్తున్నారు. తరగతి గదిలోనే కాకుండా హాస్టల్స్‌ను విజిట్ చేస్తూ సాదకబాధకాలు తెలుసుకుంటున్నారు. అవార్డు తనలో బాధ్యత పెంచిందని అరుణ ఈ సందర్భంగా తెలిపారు.

కన్నేసి కాటేస్తూ..

- కూటమి ప్రభుత్వంలో బాలికలపై పెరిగిన అకృత్యాలు
- ఆడబిడ్డ ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రుల్లో ఆందోళన
- అధికార మదంతో 'పచ్చ' నేతల దురాగతాలు
- చట్టమున్నా రెచ్చిపోతున్న వైనం



అనంతపురం: ఆడబిడ్డలకు భద్రత కొరవడింది. బడిలో, బస్సులో, ఇంటా, బయట ఇలా ఎక్కడ చూసినా కాచుకుని కన్నేస్తున్న మృగాళ్లు ఒక్కసారిగా కాటేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆడబిడ్డ తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. గత పది నెలల్లో చిన్నారులపై లైంగిక దాడుల కేసులు 12 నమోదయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. బయటకు చెబితే పరువు పోతుందనే భయంతో చాలామంది తల్లిదండ్రులు మిన్నకుండిపోతున్నారు. చాలా తక్కువ ఘటనలే పోలీస్‌స్టేషన్ల వరకు వెళ్తున్నాయి.

బరి తెగిస్తున్న 'పచ్చ' నాయకులు

కూటమి ప్రభుత్వంలో అకృత్యాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. తామేం చేసినా చెల్లుబాటవుతుందనే అహంకారంతో అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. ఇటీవలే కణేకల్లు మండలం యర్రగుంట గ్రామంలో ఓ 'పచ్చ' నేత 8వ తరగతి చదివే బాలికను మానసికంగా, శారీరకంగా హింసించాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె హెచ్చెల్సీలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అదృష్టవశాత్తూ తల్లిదండ్రులు అప్రమత్తమై కుమార్తెను కాపాడుకున్నారు. వివాహితుడైనప్పటికీ, వావివరసలు మరచి బాలికను వేధించిన తీరు సభ్యసమాజాన్ని సిగ్గు పడేలా చేసింది.

మచ్చుకు కొన్ని ఘటనలిలా..

పుట్లూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన రవితేజ అదే గ్రామానికి చెందిన బాలికను తాడిపత్రి మార్కెట్ యార్డు సమీపంలో నిలిపి ఉన్న ఐచర్ వాహనంలోకి బలవంతంగా ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించి అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. దీనిపై బాధిత బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు రవితేజపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

- మూడు నెలల క్రితం నార్పల మండల కేంద్రంలో ఓ బాలికపై మహేష్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన మహేష్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.

చట్టం ఉన్నా..

బాలికలు, చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తారని తెలిసినా మృగాళ్లు వెనక్కి తగ్గడం లేదు. ఇలాంటి కేసుల్లో జీవిత ఖైదు, లేదా 7 నుంచి 10 సంవత్సరాలు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అయినా లైంగిక దాడులు ఆగకపోవడం మృగాళ్ల బరితెగింపునకు అద్దం పడుతోంది. నేటి స్మార్ట్ యుగంలో చిన్న పిల్లలకు సైతం స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉండంతో పిల్లలు చెడు మార్గం పట్టే అవకావం ఉందని సైకాలజిస్టులు, విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఏం చేస్తున్నారనే విషయాలతో పాటు వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలంటున్నారు.

విషాదం నింపిన వినాయక నిమజ్జనం



మృతి చెందిన వరుణ్

ఉరవకొండ (విడపనకల్లు): ఆ బాలుడు ఎంతో ఇష్టంగా బుల్లి మట్టి వినాయకుడిని తయారుచేశాడు. నిత్యం పూలు పెట్టి పూజలు చేశాడు. వినాయకుడిని గంగమ్మ ఒడికి చేర్చి వీడ్కోలు పలుకుదామని ఉత్సాహంగా వెళ్లిన అతడిని మృత్యువు మింగేసింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడిని దూరం చేసి తల్లిదండ్రులకు తీరని శోకం నింపింది. వివరాలు.. విడపనకల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రామాంజినేయులు, రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలతో పాటు 3వ తరగతి చదువుతున్న కుమారుడు వరుణ్ (8) ఉన్నాడు. తాను మట్టితో తయారు చేసిన వినాయకుడిని నిమజ్జనం చేయాలని బుధవారం ముగ్గురు స్నేహితులతో కలిసి కాలనీ సమీపంలోని గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) 6వ డిస్ట్రిబ్యూటరీ వద్దకు వరుణ్ వెళ్లాడు. గణేశుడి ప్రతిమను నీటిలోకి వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడ్డాడు. గమనించిన స్నేహితులు పరుగున వెళ్లి కుటుంబ సభ్యులతో పాటు కాలనీవాసులకు చెప్పారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న వారు నీళ్లలో కొట్టుకుపోతున్న వరుణ్‌ను బయటకు తీసి ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వరుణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు కళ్ల ముందే మృత్యు ఒడికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

● ప్రశాంతి నిలయంలో ఓనం వైభవం



నృత్య రూపకంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: కేరళీయులు పవిత్రంగా ఆచరించే ఓనం వేడుకలు బుధవారం ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలను పురస్కరించుకుని సాయికుల్వంత్ సభా మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత కేరళ సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లం ఎంపీ ఎన్‌కె. ప్రేమ చంద్రన్ ప్రసంగిస్తూ.. ఓనం పర్వదిన విశిష్టతను, సత్యసాయి నిస్వార్థ సేవలను వివరించారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. అనంతరం శ్రీశైలానికి చెందిన శ్రీసత్యసాయి విద్యాపీఠం విద్యార్థులు "ది పాథ్ ఆఫ్ ట్రూ డివోషన్" పేరుతో నృత్యరూపకం ప్రదర్శించారు. శబరి భక్తి ప్రపత్తులను వివరిస్తూ అద్భుతంగా ఆడిపాడారు.




కళాకారుల నాటక ప్రదర్శన



సంగీత కచేరీ నిర్వహిస్తున్న బాలవికాస్ చిన్నారులు

గుమ్మనూరు క్షమాపణ చెప్పాల్సిందే



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

- రైతుల పక్షాన పోరాడితే చంపుతామంటారా?
- రైతు సంఘాల నాయకుల మండిపాటు

అనంతపురం అర్బన్: రైతుల తరపున పోరాడితే చంపుతామంటారా అంటూ రైతు, కార్మిక, రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నించారు. తమ సంఘం నాయకులపై నోరుపారేసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో విలేకరులతో రైతు, రైతు కూలీ, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, నాగేంద్రకుమార్, కృష్ణమూర్తి మాట్లాడారు. గుత్తి, పామిడి మండలాల్లో సోలార్ ప్రాజెక్టుకు జరుగుతున్న భూసేకరణను పరిశీలించేందుకు వెళ్లిన రైతు సంఘం నాయకులను ఎమ్మెల్యే జయరామ్ అసభ్య పదజాలంతో దూషించారన్నారు. 'అరగంటలో వెళ్లకపోతే చంపుతాం, తరిమికొడతాం' అంటూ ఫోన్‌లో బెదిరింపులకు దిగారన్నారు. ఆయన బెదిరింపులకు భయపడేవారెవరూ లేరన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోని బేతాపల్లిలో ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా రైతులను మభ్యపెట్టి, బెదిరింపులకు దిగి కంపెనీకి భూములు ఇచ్చేలా చేస్తున్నారన్నారు. కంపెనీ యాజమాన్యంతో ఎమ్మెల్యే కుమ్మక్కయ్యారని ఆరోపించారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని ఎన్నికల ముందు చెప్పిన కూటమి నాయకులు నేడు ఎడారిగా మార్చేందుకు సిద్ధపడ్డారని మండిపడ్డారు. రైతుల కోసం వెనకడుగు వేసేది లేదని, ఎంతవరకైనా పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. సంఘాల నాయకులు, శివారెడ్డి, నాగమణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాయం మాటున కుచ్చుటోపీ

అనంతపురం: సాయం మాటున మాయ మాటలు చెప్పి సెల్‌ఫోన్‌తో పాటు రూ.57 వేలు నొక్కేసిన ఉదంతమిది. అనంతపురం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఎర్రిస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. నగరంలోని ఎస్ఎస్ఎస్ బార్ వద్ద గత నెల 17న బైక్‌పై వెళ్తున్న ఎర్రిస్వామిని ఆటో ఢీకొంది. దీంతో గాయాలపాలైన ఎర్రిస్వామి వద్దకు ఓ వ్యక్తి వెళ్లి ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన చికిత్స చేయిస్తానంటూ మాయమాటలు చెప్పాడు. ఎర్రిస్వామిని ఆటోలో ఎక్కించి సర్వజనాసుపత్రికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే ఎర్రిస్వామి ఫోన్ తీసుకుని అందులోని ఫోన్‌పే నుంచి రూ.57 వేలను తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. ఫోన్ ఇవ్వు అని ఎర్రిస్వామి అడగ్గా.. ఒక్క నిమిషంలో వస్తానంటూ ఫోన్‌లో మాట్లాడుకుంటూనే ఆస్పత్రి నుంచి జారుకున్నాడు. కొంతసేపటికి అక్కడున్న వారి మొబైల్ తీసుకుని ఎర్రిస్వామి తన నంబర్‌కు ఫోన్ చేశాడు. లిఫ్ట్ చేసిన సదరు వ్యక్తి 'నన్ను పోలీసులు పట్టుకున్నారు.. పది నిమిషాల్లో వస్తా' అని చెప్పి వెంటనే ఫోన్ స్విచాఫ్ చేసుకున్నాడు. ఆస్పత్రిలో కోలుకుని డిశ్చార్జ్ అయిన ఎర్రిస్వామి బుధవారం సెల్‌ఫోన్‌తో పాటు తన పూర్వనంబర్‌తో కొత్త సిమ్ తీసుకున్నాడు. సిమ్ వేసి పరిశీలిస్తే ఈ నెల 17న బొగ్గం మురళీ అనే వ్యక్తి ఫోన్‌పేకు రూ. 57 వేలు వెళ్లినట్లు తేలింది. దీనిపై బాధితుడు అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్

అనంతపురం మెడికల్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దోమ కాటు నివారణ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఫీవర్ సర్వే చేసేలా మలేరియా విభాగానికి సూచించామన్నారు. ప్రజలు సైతం దోమకాటు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

రూ.2.73 లక్షల విలువైన ఎరువుల విక్రయాల నిలుపుదల

అనంతపురం అగ్రికల్చర్/ఉరవకొండ రూరల్: నిల్వలకు, రికార్డులకు పొంతన లేని రూ.2.73 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఫర్టిలైజర్ దుకాణదారులకు విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.నాగభూషణం, ఎస్ఐ నరేంద్రభూపతి, వ్యవసాయ అధికారి వాసుప్రకాష్ ఇతర సిబ్బంది బుధవారం జిల్లా వ్యాప్తంగా తొమ్మిది దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఉరవకొండలోని నాలుగు దుకాణాల్లో భౌతిక నిలువలు, ఈ–పాస్ మిషన్ నిల్వల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో రూ.2.73 లక్షల విలువ చేసే 9.60 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ నోటీసులు జారీ చేశారు. యూరియాకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించినా, నో స్టాక్ బోర్డులు పెట్టడం లాంటివి చేస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


భూసంరక్షణా విభాగం ఈఈగా పోలప్ప

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న భూసంరక్షణా విభాగం (సాయిల్ కన్సర్వేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ)గా పోలప్ప బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఆ స్థానంలో ఇప్పటి వరకూ ఇన్‌చార్జి ఈఈగా ఉన్న ఓబుళపతి బాధ్యతలు అప్పజెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో డీఈగా ఉన్న పోలప్పకు ఈఈగా పదోన్నతి కల్పించి జిల్లాకు బదిలీ చేశారు. అలాగే డీఈ హోదాలో ఉన్న ఇన్‌చార్జి ఈఈ ఓబుళపతికి సైతం ఈఈగా పదోన్నతి కల్పించి ఒంగోలుకు బదిలీ చేశారు. అయితే ఓబుళపతి డెప్యుటేషన్ కింద ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్‌గా కొనసాగనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఇరువురూ ఈఈలకు ఆ శాఖ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

11, 12న కళా ఉత్సవ్

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నంలోని డైట్ కళాశాల వేదికగా ఈ నెల 11, 12 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులకు సంస్కృతి, కళలపై జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు–2025 నిర్వహించనున్నారు. ఈ మేరకు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. పూర్తి వివరాలకు 99499 93712, 79817 76864లో సంప్రదించవచ్చు.

గుంతకల్లుకు జ్వరమొచ్చింది



- జ్వర పీడితులతో కిక్కిరిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు
- ఓపీలో 35 శాతం జ్వర పీడితులే



గుంతకల్లులోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

గుంతకల్లు టౌన్: వాతావరణంలో మార్పుల మాట ఎలా ఉన్నా.. గుంతకల్లులో లోపించిన పారిశుధ్యం కారణంగా విష జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. జ్వర పీడితులతో ప్రభుత్వ ఏరియా, అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ లోపం కారణంగా గత ఇరవై రోజులుగా వరుసగా కురిసిన వర్షాలతో ఎటు చూసినా నీరు నిల్వ ఉండిపోయింది. దీనికి తోడు దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. గత ప్రభుత్వంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కే ఆదర్శంగా నిలిచిన గుంతకల్లు మున్సిపాల్టీలో ప్రస్తుతం అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు గగ్గోలు పెడుతున్నా.. అధికారులు స్పందించడం లేదనే విమర్శలున్నాయి.

చిన్నారులే అత్యధికంగా...

గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోజూ 650 నుంచి 700 మంది వరకు ఓపీ నమోదవుతోంది. గత 20 రోజులుగా ఔట్ పేషెంట్లల్లో సుమారు 35 శాతం మంది జ్వరపీడితులే ఉంటున్నారు. వీరిలో టైఫాయిడ్, దగ్గు, జలుబు, గొంతునొప్పితో బాధపడుతున్న వారే అఅత్యధికంగా ఉన్నట్లు ఆస్పత్రి రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో చిన్నపిల్లలే ఎక్కువగా ఉండడం ఆందోళన కరం. బుధవారం ఇన్ పేషెంట్‌గా చికిత్స పొందుతున్న 60 మందిలో 40 మంది జ్వరంతో బాధపడుతున్న వారు కాగా, వీరిలో 25 మంది చిన్నారులు ఉన్నారు. దీంతో ఆస్పత్రిలోని మూడు ఎంఎల్, చిన్నారుల వార్డులు జ్వరపీడితులతో నిండిపోయాయి. ఆస్పత్రిలోని ల్యాబ్‌లో రోరజూ 80 నుంచి 120 మందికి రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరిలో 35 నుంచి 40 వైరల్ ఫీవర్ కేసులు బయటపడుతున్నాయి. గుంతకల్లులోని నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లల్లోనూ ఇదే పరిస్థితి. చిన్నపిల్లల ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యులు ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు ఎడతెరపి లేకుండా వైద్యమందిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

చాలా జాగ్రత్తలు పాటించాలి



ఈ సీజన్‌లో పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు పాటించాలి. వాతావరణ మార్పుల కారణంగా విష జ్వరాలు పెరిగిపోతున్నాయి. 20 రోజులుగా టైఫాయిడ్, దగ్గు, జలుబు, గొంతునొప్పి కేసులే ఎక్కువగా వస్తున్నాయి. ప్రధానంగా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది జ్వరాల బారిన పడే ప్రమాదముంది. జ్వరం అధికంగా ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.

– డాక్టర్ శ్రీనివాసయాదవ్, గుంతకల్లు

పేరుకుపోతున్న చెత్తాచెదారం



గుంతకల్లు సోఫియా స్ట్రీట్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ వెనుక రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం

గుంతకల్లు పట్టణంలో ఎటు చూసినా చెత్తాచెదారం పేరుకుపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఆటోల ద్వారా చెత్త సేకరణ సక్రమంగా జరిగేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఆ ఆటోలు తిరగట్లేదు. ఉన్న అరకొర ట్రాక్టర్లు, నాలుగైదు ఆటోలతో వారానికి రెండు లేదా మూడుసార్లు మాత్రమే చెత్త సేకరిస్తున్నారు. ఇక డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో పాటు పైప్‌లైన్ ఏర్పాటు పేరిట రోడ్లను ధ్వంసం చేయడంతో వీధులన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. ఎటు చూసినా వర్షం నీరు, మురుగు నిల్వ ఉంటోంది. పట్టపగలే దోమల చెలరేగిపోతున్నాయి. దోమల నివారణ చర్యలు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తాయి. గత కౌన్సిల్ సమావేశాల్లోనూ వార్డుల్లో లోపించిన పారిశుధ్యంపై అధికారులను సభ్యులు నిలదీశారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేయడం తప్ప అధికారులు సాధించిన పురోగతి అంటూ ఏదీ లేదు. రోజూ తాము పనిచేస్తున్నట్లుగా అపరిశుభ్రత ప్రాంతాల్లో ఫొటోలు దిగి వాటిని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడం తప్ప.. చెత్తాచెదారాన్ని తొలగించడం లేదు. మున్సిపల్ అధికారుల తీరుపై సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

- మహిళలకు ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి పిలుపు



మాట్లాడుతున్న పుణ్యవతి

అనంతపురం అర్బన్: హక్కుల సాధనకు ఏకమై ఉద్యమించాలని మహిళలకు ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురంలోని లలితకళాపరిషత్‌లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన జిల్లా మహాసభలు జరిగాయి. పుణ్యవతితో పాటు రాష్ట్ర కోశాధికారి సావిత్రి, డాక్టర్ ప్రసూన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలు సగభాగం ఉన్నా.. వారు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. మహిళలపై వివక్ష, అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైక్రో ఫైనాన్స్ ఆగడాల నుంచి మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులు, గృహహింస నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆగడాలకు మద్యం, మత్తు పదార్థాలు కూడా కారణమన్నారు. ప్రతి మహిళ చైతన్యవంతమైన హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకురాళ్లు చంద్రిక, అశ్విని, శంసాద్, రామాంజినమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఐద్వా జిల్లా మహాసభల్లో 13 మందితో కూడిన జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా శ్యామల, కార్యదర్శిగా చంద్రిక, కోశాధికారిగా అశ్విని, కార్యదర్శివర్గ సభ్యులుగా షంషాద్, రామాంజినమ్మ, సుజాత, గీత, శైలజ, రేణుక, రంగమ్మ, కృష్ణవేణి, లక్ష్మమ్మదేవి, నడివక్క ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా 26 మందిని ఎన్నుకున్నారు.

పనితీరులో మార్పు రావాలి

- పీఆర్ ఉద్యోగుల సమీక్షలో ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు



పీఆర్ ఎస్ఈ చిన్నసుబ్బరాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: 'గతంలో ఎలా పని చేశారో నాకు అనవసరం. ఇకపై పరస్పర సహకారం, సమన్వయంతో పని చేయాలి. మెరుగైన ఫలితాలు సాధించాలి. పనితీరులో మార్పు రాకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి' అని పంచాయతీరాజ్ ఉద్యోగులను ఆ శాఖ ఎస్ఈ వై.చిన్నసుబ్బరాయుడు హెచ్చరించారు. పదోన్నతిపై బాపట్ల నుంచి వచ్చిన ఆయన అనంతపురంలోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ పీఏ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్లు ఖాజీ మొహిద్దీన్, రమాదేవి, డీఈఈలు కృష్ణజ్యోతి, కె.లక్ష్మీనారాయణ, శ్రీనివాసకుమార్, ఏఈఈ హుస్సేన్‌బాషా, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈఈ ప్రభాకర్‌రెడ్డితో కలసి తన చాంబర్‌లో ఉద్యోగులతో సమావేశమై మాట్లాడారు. రెగ్యులర్ ఉద్యోగులు ఎవరెవరు, ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నదెవరు, డిప్యూటేషన్లపై ఎవరెవరు ఉన్నారని ఆరా తీశారు. అన్ని శాఖలకంటే పంచాయతీరాజ్ శాఖ పురోగతిలో ముందు వరుసలో ఉండాలన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా మసలుకోవాలన్నారు. కేటాయించిన పనులు ఎప్పటికప్పుడు పూర్తి కావాలన్నారు. గ్రూపు రాజకీయాలు నడిపితే సహించేది లేదన్నారు.

ఇన్‌చార్జ్ ఈఓగా తిరుమలరెడ్డి



ఉరవకొండ రూరల్: ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా ఎస్.తిరుమలరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఈఓ సాకే రమేష్‌బాబు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో తిరుమలరెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

యువకుడి దుర్మరణం

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మరుట్ల–1వ కాలనీకి చెందిన అనిల్ (32), ఏకనాథ్ మంగళవారం రాత్రి అనంతపురంలో డ్రిప్ పరికరాలను ఆటోలో లోడు చేసుకుని స్వగ్రామానికి ప్రయాణమయ్యారు. ముద్దలాపురం సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తా పడి అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ఏకనాథ్‌ను స్థానికులు అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువతి ఆత్మహత్య



పుష్పలత మృతదేహం

గుంతకల్లు రూరల్: మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన పుష్పలత (19) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. నాగిరెడ్డి, తిరుమలమ్మ దంపతులకు బీటెక్ చదువుతున్న కుమారుడితో పాటు కుమార్తె పుష్పలత ఉన్నారు. ఇంటర్ పూర్తి చేసిన పుష్పలత కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతుంది. తల్లిదండ్రులు చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. నొప్పి తీవ్రత తాళలేక బుధవారం ఉదయం తల్లి ఇంటి బయట దుస్తులు ఉతుకుతుండగా ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న కసాపురం పోలీసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా – వివాహిత మృతి

శింగనమల(నార్పల): ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (40)కి భర్త, పిల్లలు ఉన్నారు. నార్పల మండలం గుంజేపల్లిలో సమీప బంధువుల మంచిమాట కార్యక్రమానికి బుధవారం వచ్చిన ఆమె ఆ తర్వాత నార్పలలో ముహూర్తం కట్టుకునేందుకు వెళ్లారు. ఈ ప్రక్రియ ముగియగానే ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. నీలితోటపల్లి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడి లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి బలవన్మరణం

అనంతపురం: క్షణికావేశానికి లోనై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని కొప్పళకు చెందిన చింతపల్లి మంజునాథ్ (52) 20 ఏళ్ల క్రితం అనంతపురంలోని బ్రాహ్మణవీధికి చెందిన అన్నపూర్ణను పెళ్లి చేసుకుని నగరంలోనే స్థిరపడ్డాడు. అత్తింటి వారు అందజేసిన ఆర్థిక సాయంతో దుస్తుల దుకాణాల ఏర్పాటు చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ఇటీవల వ్యాపారం సజావుగా సాగకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. పెట్టుబడులకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగింది. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక క్షణికావేశానికి లోనై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడక గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకూ పోరాటం

- ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతినాయుడు



నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం రూరల్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం దగా చేసిందని ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు మండిపడ్డారు. డిమాండ్ సాధనలో భాగంగా బుధవారం ఏపీ వాల్మీకి, బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య ఆధ్వర్యంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసుల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. రుద్రంపేటలోని వాల్మీకి భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులను పోలీసులు అడ్డుకుని నాల్గో పట్టణ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా క్రాంతి నాయుడు మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే వరకూ తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేష్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు మేకల శివ, నాగేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

భారత క్రికెట్ జట్టులో స్థానమే అంతిమ లక్ష్యం కావాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం: భారత క్రికెట్ జట్టులో స్థానం దక్కించుకోవడమే అంతిమ లక్ష్యంగా శ్రమించాలని క్రికెటర్లకు కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో బుధవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్–19 క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఆంధ్రా ప్రెసిడెంట్, బరోడా జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలకు ఆర్డీటీ నిలయంగా మారడం గర్వకారణమన్నారు. క్రికెట్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి భీమలింగా రెడ్డి, వెటరన్స్ క్రికెట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డి, ఏసీఏ జూనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అచ్యుతరావు, సెలెక్టర్ లీలా మోహన్ రెడ్డి, ట్రెజరర్ షబ్బీర్ అహమ్మద్, మాజీ రంజీ ప్లేయర్ సురేష్, ఏడీసీఏ సభ్యులు చంద్రమోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తిగా తొలి రౌండ్ మ్యాచ్‌లు

తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో బరోడా, ఆంధ్రా సెక్రెటరీ జట్లు గెలిచాయి. ఆంధ్రా సెక్రెటరీ, మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిమధ్యప్రదేశ్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. ఆంధ్రా సెక్రెటరీ జట్టు 40.4 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ఈశ్వర్ రిత్విక్ 78 పరుగులు, పి.సిద్ధు కార్తీకర్ రెడ్డి 67 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ జట్టు 48.1 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయింది. ఆంధ్రా ప్రెసిడెంట్ , బరోడా జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు 46.5 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 235 పరుగులు సాధించింది. కోగటం హనీష్ వీరారెడ్డి 68 బంతుల్లో 97 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ బరిలో దిగిన బరోడా జట్టు కేవలం 38.1 ఓవర్లలోనే నాలుగు వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో విశ్వాస్ పటేల్ 82 బంతుల్లో 105 పరుగులు సాధించాడు.

డీపీఆర్వో రమణకు పదోన్నతి



రమణను సన్మానిస్తున్న డీఐపీఆర్ఓ బాలకొండయ్య, సిబ్బంది

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్ఓ)పి.వెంకటరమణకు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పదోన్నతి కల్పిస్తూ బాపట్ల జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. పదోన్నతిపై వెళుతున్న రమణను కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. డీఐపీఆర్ఓ బాలకొండయ్య మాట్లాడుతూ డీపీఆర్ఓగా వెంకటరమణ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, పీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, సిబ్బంది ప్రభావతి, దామోదర్‌రెడ్డి, కమల్, ఆంజనేయులు, భాస్కర్, ఖాసీమ్ పాల్గొన్నారు.

ఉల్లి పంట పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి ఉమాదేవి

సాక్షి ఎఫెక్ట్..

గుమ్మఘట్ట: మండలంలో రైతులు సాగు చేసిన ఉల్లి పంటను జిల్లా ఉద్యాన అధికారి ఉమాదేవి బుధవారం పరిశీలించారు. ఉల్లి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గత నెల 31న 'కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆమె స్పందించారు. గుమ్మఘట్ట మండలం 75వీరాపురం గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన ఉల్లి పంటను పరిశీలించారు. అధిక వర్షాల కారణంగా దిగుబడిలో నాణ్యత లోపించినట్లుగా గుర్తించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. దిగుబడుల, మార్కెటింగ్ తదితరాలపై ఆరా తీశారు. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధరలు దారుణంగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట ను గ్రేడింగ్ చేసి సమీపంలోని బెంగళూరు, దావణగెర మార్కెట్‌లకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట స్థానిక ఉద్యాన అధికారి కృష్ణతేజ, సర్పంచ్ నాగరాజు తదితరులు ఉన్నారు.


జిల్లాకు 1,923 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: స్పిక్ కంపెనీ నుంచి 1,922.75 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు సరఫరా కాగా, ఇందులో 904.5 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు బుధవారం వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులు, యూరియాను పరిశీలించారు. 904.5 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు 507.85 మెట్రిక్ టన్నుల డీఏపీ, 255.2 మెట్రిక్ టన్నుల 20–20–0–13, 255.2 మెట్రిక్ టన్నుల 10–26–26 రకం కాంప్లెక్స్ ఎరువులు చేరాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియాకు సంబంధించి కోటా మేరకు 399.915 మెట్రిక్ టన్నులు అనంతపురం మార్క్‌ఫెడ్‌కు, 200.655 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు కేటాయించగా... 303.93 మెట్రిక్ టన్నులు శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. కాంప్లెక్స్, డీఏపీలు 90 శాతం మేర ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు 10 శాతం మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు వివరించారు.

9 బార్ల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ

అనంతపురం: నూతన బార్ పాలసీలో భాగంగా గత వారం జారీ చేసిన 9 బార్ల ఏర్పాటు నోటిఫికేషన్‌కు ఎలాంటి దరఖాస్తులు అందకపోవడంతో తాజాగా మరోసారి నోటిఫికేషన్‌ను జిల్లా ఎక్సైజ్ అధికారులు జారీ చేశారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువుగా నిర్దేశించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 15న లాటరీ ద్వారా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. అనంతపురంలో 3, గుంతకల్లు 2, గుత్తి, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 9 బార్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు.

ఎలుగుబంట్ల దాడిలో కాపరికి తీవ్ర గాయాలు



గాయపడిన రంగధామప్ప

రొళ్ల: రెండు ఎలుగుబంట్లు దాడి చేయడంతో మేకల కాపరి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండలంలో జరిగింది. టీడీ పల్లి ఎస్సీ కాలనీకి చెందిన రంగధామప్ప మేక పిల్లల మేత కోసం గ్రామ పొలిమేర వద్ద గడ్డి కోస్తుండగా పక్కనే ఉన్న అటవీ ప్రాంతం నుంచి రెండు పెద్ద ఎలుగుబంట్లు హఠాత్తుగా వచ్చి దాడి చేశాయి. తప్పించుకోవడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. వెంబడించి మరీ ఎడమ చేయి, భుజం, కుడికాలు తొడ కింద భాగాన తీవ్రంగా రక్కి గాయపరిచాయి. అతి కష్టంపై తప్పించుకుని ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే రొళ్ల సీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

క్లుప్తంగా

డ్రగ్స్‌కు బానిస కావొద్దు


మాదక ద్రవ్యాల నిరోధంపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.చంద్రశేఖర్ రెడ్డి,ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. రామ్మోహన్ రెడ్డి, పీఆర్వో డాక్టర్ బి. ఓంప్రకాష్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణిరాధ తదితరులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే..ఎలాంటి అనర్థాలకు దారి తీస్తాయో వివరించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్గించే పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆర్డీటీని పరిరక్షించాలి



జిల్లా కోర్టులో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

అనంతపురం: ఆర్డీటీ సంస్థను పరిరక్షించాలని జిల్లా కోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలనే డిమాండ్‌తో బుధవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. జిల్లా కోర్టు నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ చేపట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద, బడుగు, బలహీన వర్గాలకు దన్నుగా నిలుస్తూ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఆర్డీటీ సంస్థ ఆవశ్యకతను వివరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ఉపాధ్యక్షుడు ధర్మసింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, వెంకట రఘు కుమార్, సీనియర్ న్యాయవాదులు వై. రామలింగా రెడ్డి, పీఎల్ ఈశ్వర రెడ్డి, బడా నారాయణ రెడ్డి, ఆర్ఎల్ఎస్ ప్రసాద్, పెద్దన్న, పుల్లయ్యబాబు, యల్లరాజు, హాజీ, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఎంటెక్ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల


ఫలితాలను ప్రకటిస్తున్న అధికారులు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఎంటెక్ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఆగస్టులో నిర్వహించిన పరీక్ష ఫలితాలను బుధవారం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా అకడమిక్ సెక్షన్లలో సంప్రదించి ఫలితాలను తెలుసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్. వసుంధర తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లకు జరిమానా


హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అనేక హోటళ్లలో రుచి, శుభ్రత కొరవడింది. బుధవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, సచివాలయ సిబ్బంది పట్టణంలోని పలు హోటళ్లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. కణేకల్లు రోడ్డులోని లక్ష్మి ఫ్యామిలీ రెస్టారెంట్, తృప్తి గ్రాండ్ హోటళ్లలో తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, మాంసాన్ని గుర్తించి పారవేసినట్లు చెప్పారు. మరోసారి తనిఖీల్లో నిల్వ ఆహార పదార్థాలు ఉంటే హోటళ్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్సు లేని తృప్తి హోటల్‌కు రూ.5 వేలు, ప్లాస్టిక్ వినియోగిస్తున్న లక్ష్మి హోటల్‌కు రూ.2500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

నరకమార్గం

- పి.యాలేరుకు ప్రయాణం కష్టమే..
- గుంతలమయమైన రోడ్డుతో నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


రోడ్డంతా గుంతలమయంగా మారి వర్షపు నీరు నిలిచిన దృశ్యం


బురదబురదగా మారిన రోడ్డులో అవస్థలు పడుతూ వెళ్తున్న వాహనదారులు

ఆత్మకూరు: మండల కేంద్రమైన ఆత్మకూరు, పి.యాలేరు మధ్య దూరం కేవలం మూడు కిలోమీటర్లు. కానీ గ్రామం చేరేందుకు 20 నిమిషాలకుపైనే సమయం పడుతుంది. రోడ్డంతా పెద్ద పెద్ద గోతులు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డుపై ఉన్న గుంతలు నిండా నీరు చేరింది. దీంతో గుంతలోతు అంచనా వేయలేక వాహనదారులు కిందపడపోతున్నారు. ఇక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఆటోల్లో ప్రయాణించే వారు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందంటూ గ్రామస్తులు వాపోతున్నారు. ఓట్లు అడగడానికి మాత్రమే నాయకులకు ప్రజలు గుర్తుకు వస్తారా ? ఇలాంటి సమస్యలు ఉన్నాయని తెలియజేసినా పట్టించుకోరా అంటూ ప్రజాప్రతినిధులపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పి. యాలేరు గ్రామానికి రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జనంపై 'బండ' బాదుడు

- గ్యాస్ సిలిండర్‌పై డెలివరీలో చేతివాటం
- ఒక్కో సిలిండర్‌పై రూ.50 ఎక్కువ వసూలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు


గ్యాస్ బుక్కులో మాత్రం రూ.920 రాసిన దృశ్యం



ఆత్మకూరు: పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలతో అల్లాడిపోతున్న వినియోగదారులకు డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లతో చుక్కలు చూపుతున్నారు. సిలిండర్‌కు నిర్ణయించిన మొత్తం కంటే అదనంగా డబ్బు వసూలు చేయరాదు. కానీ డెలివరీ బాయ్స్ మాత్రం ఇవన్నీ పట్టించుకోవడం లేదు. ఆయా కంపెనీల నుంచి వారికి జీతం వస్తున్నప్పటికీ వినియోగదారుల నుంచి సిలిండర్‌పై అదనంగా రూ.50 దాకా వసూలు చేస్తూనే ఉన్నారు.

ఒక్కో సిలిండర్ రూ.970..

గ్యాస్ సిలెండర్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.875 అయితే సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ రూ.44 కలిపి మొత్తంగా రూ.919 చెల్లించాలి. ఇదే మొత్తానికి వస్తోంది. కానీ గ్యాస్ డెలివరీ బాయ్స్ మాత్రం ఒక సిలిండర్‌కు మండల కేంద్రంలో అయితే రూ.950, పల్లెల్లో అయితే రూ.970 మేర వసూలు చేస్తున్నారు. గ్యాస్ సబ్సిడీ బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదంటుంటే.... మళ్లీ ఇదో భారమంటూ వంటగ్యాస్ వినియోగదారులు వాపోతున్నారు.

మండల కేంద్రంలోనూ వసూళ్ల..

నిభందనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీ నుంచి ఇళ్లు 5 కిలోమీటర్ల లోపు ఉంటే సిలిండర్ ఉచితంగా డెలివరీ ఇవ్వాలి. 5 కి.మీ దాటితే అదనంగా అది కూడా నిర్ణయించిన మేరకే తీసుకోవాలి. కానీ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు డెలివరీ బాయ్స్ చేత మండల కేంద్రంలోనూ సిలిండర్‌పై రూ.50 అదనంగా వసూలు చేయిస్తున్నారు. ఇక పల్లెల్లో అయితే డెలివరీ బాయ్స్ చెప్పినంత ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అడినంత ఇవ్వకపోతే తిప్పలే..

సిలిండర్ ధరపై బాయ్స్‌కు అదనపు సొమ్ము రూ.50 ఇవ్వకపోతే వినియోదారులకు తిప్పలు తప్పవు. అదనంగా డబ్బులివ్వకపోతే 'డోర్ లాక్' అని చెప్పి ఏజెన్సీలో సిలిండర్‌ను వెనక్కి ఇచ్చేస్తుంటారు. దీంతో బుకింగ్ రద్దవుతుంది. మరోమారు వినియోదారుడు బుక్ చేయాలి. ఇలా రెండు మూడు దఫాలు ఇబ్బందికి గురి చేస్తారు. దీంతో ఈ తిప్పలు పడలేక వినియోదారులు తప్పని పరిస్థితిలో సిలిండర్‌పై అదనపు మొత్తాన్ని ఇచ్చుకుంటారు.

అదనంగా వసూలు చేయరాదు

గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్ణయించిన మేరకే డబ్బులివ్వాలి. అదనంగా ఒక్క రూపాయి కూడా వసూలు చేయడానికి వీల్లేదు. ఈ విషయాన్ని ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపాం. కానీ ఆత్మకూరులో కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలవరీ బాయ్స్ అదనంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. విచారించి చర్యలు తీసుకుంటాం.
– లక్ష్మీదేవి, సీఎస్‌డీటీ

వైద్యం.. అవస్థలమయం


సర్వజనాస్పత్రిలోని ఓపీ నంబర్ 3 వద్ద బారులు తీరిన రోగులు


వాహనాల మధ్యే ఈఎన్‌టీ వార్డుకు ఆపరేషన్ అయిన రోగిని తీసుకెళ్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణ లోపంతో రోగులు అవస్థలు పడుతున్నారు. వైద్యం పొందేందుకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఓపీ తీసుకోవడానికి గంటకుపైగా సమయం పట్టడంతో పాటు వైద్యం పొందడానికి మరో గంటకుపైగా సమయం పడుతోంది. దీంతో ఓపీలో నిల్చుని రోగులు నీరసించిపోతున్నారు. అందులోనూ కనీసం ఓపీ లైన్ క్రమపద్ధతిగా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతూ నిల్చోవాల్సి వస్తోంది. బుధవారం సర్వజనాస్పత్రిలోని ఓపీ నంబర్ 3, 4, 5, 6, 7,8,9కు రోగులు భారీగా రావడం, సీట్లలో కూర్చోవాల్సిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్యంలో తీవ్ర జాప్యం జరిగింది. ఆస్పత్రి అధికారులు ఓపీలను తరచూ పర్యవేక్షిస్తే రోగులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో వైద్యం అందే అవకాశం లేకపోలేదు.

పార్కింగ్ ఏదీ..?

ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ప్రవేశ మార్గం వద్ద నుంచి ఆస్పత్రి చుట్టూ ద్విచక్ర వాహనాలు, కార్లు పెద్ద ఎత్తున నిలుపుతున్నారు. గైనిక్, లేబర్, ఈఎన్‌టీ, బర్న్స్, ఆర్థో తదితర వార్డులకు వెళ్లేందుకు వీలు లేకుండా వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీంతో అంబులెన్స్‌లు లోపలికి రావడానికి తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రోగులకు సర్జరీ అయ్యాక వార్డులకు తీసుకెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఆస్పత్రిలో పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్మికులకు న్యాయం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్


సర్వజనాస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏళ్ల తరబడి పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు ధర్నా చేపట్టారు. నెలల తరబడి శానిటేషన్ సిబ్బందికి వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అదేవిధంగా ఈపీఎఫ్ సగం జమచేయలేదన్నారు. కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి న్యాయం చేయని పక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఏపీ మెడికల్ కాంట్రాక్టర్స్, వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు శోభా, వన్నూర్, మంజుల, నారప్ప, షామీదా, రేష్మా, అంజలి, శివ, ప్రశాంత్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాగసూరి సాహిత్యం విలక్షణం


మాట్లాడుతున్న సీనియర్ రచయిత నాగసూరి వేణుగోపాల్

అనంతపురం కల్చరల్: నాగసూరి సాహిత్యం విలక్షణమని వక్తలన్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలో ఆంధ్రభారతి ఆధ్వర్యంలో 'డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సాహిత్యంలో వైవిధ్యం' అనే అంశంపై సమాలోచన జరిగింది. మాజీ వీసీ ఆచార్య రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పూజారి పద్మశ్రీ, ఆత్మీయ అతిథులుగా మాట్లాడుతూ నాగసూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్‌గా, సాహిత్య పరిశోధకుడిగా ఆయన కృషి ప్రశంసనీయమన్నారు. డాక్టర్ అంకే శ్రీనివాసులు పప్పూరి రామాచార్యులు అనే అంశంపై, రాజారామ్ 'సిగ్నేచర్ ట్యూన్' అనే అంశంపై, 'సాహితీ స్పర్శ సాహితీ వీక్షణం' అనే అంశంపై డాక్టర్ హేమమాలిని, 'విద్యాన్ విశ్వం' అనే అంశంపై డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి ప్రసంగించారు. నాగసూరి సాహిత్యంలోని అనేక మౌళిక అంశాలను వివరించారు. రెండో సమావేశంలో సాహిత్యము– సైన్సు అనే అంశంపై డాక్టర్ ప్రగతి మాట్లాడారు. ఆత్మీయ అతిథులుగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, హారిక కుసుమ్, డాక్టర్ జీఎల్ఎన్ ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ జనమాధ్యమాలలో తెలుగు భాష భిన్న రూపాలను సంతరించుకుంటున్న తీరును నాగసూరి వేణుగోపాల్ నిర్దిష్టంగా వివరించి విశ్లేషించారని తెలిపారు.

విద్యార్థినులకు 'అమ్మ' చేయూత


విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: చదువుల్లో రాణిస్తూ, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఇద్దరు విద్యార్థినులకు 'అమ్మ' సంస్థ చేయూతనందించింది. తరిమెల రమణారెడ్డి మానవత్వాన్ని చాటుకుంటూ బుధవారం రూ.1.70 లక్షలు అందించి ఉన్నత చదువులకు తోడుగా నిలిచారు. నగరానికి చెందిన పెద్దన్న, రత్నమ్మ దంపతుల సంతానమైన శ్రేయ, శిల్పలు చదువుల్లో చురుగ్గా ఉండేవారు. ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో 92 శాతంతో ఉత్తీర్ణత సాధించి కర్ణాటకలోని సూరత్కల్‌లో ఉండే ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో సీటు తెచ్చుకున్నారు. అయితే అడ్మిషన్ ఫీజు కూడా లేక ఇబ్బంది పడుతూ 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన బుధవారం విద్యార్థినులకు ఫీజు డబ్బు ఇవ్వడమే కాకుండా ఒక్కొక్కటి రూ.40 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌లను వారికందించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కల్గిన విద్యార్థులు చదువుకోవాలన్నదే 'అమ్మ' సంస్థ లక్ష్యమన్నారు. ఉన్నత స్థితిలో స్థిరపడిన తర్వాత నిరుపేదలకు అండగా నిలవాలని సూచించారు.

రాయలసీమ సేవారత్న అవార్డుల ప్రదానం


జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనాకు అవార్డును అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచన పలువురికి 'రాయలసీమ సేవ రత్న' అవార్డులను ప్రధానం చేశారు. బుధవారం స్థానిక ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫరూఖ్‌ఖాన్, డీహెచ్‌పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు హనుమంతు, డాక్టర్ మంజూరు, ఎంపీడీఓ నాగభూషణం, లాయర్ హేమాద్రి, విక్టరీ ఫౌండేషన్ డాక్టర్ విజయకుమారి, పంచాయితీ సెక్రటరీ సుధాకర్, సాయి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ప్రభాకర్, ఎంఆర్‌పీఎస్ నాయకుడు స్వామిదాస్, వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా, లేబర్ ఆఫీసర్ శివప్రసాద్, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ రాము, కానిస్టేబుల్ ఓబులేసుకు అవార్డులు అందజేశారు. అనంతరం కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ రచించిన భారతీయ ముస్లిం లెజెండ్ పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, జేవీవీ నాయకులు లక్ష్మీప్రసాద్ యాదవ్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


కోటంకలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

గార్లదిన్నె: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకంగా ఉంటుందని డీపీఎం లక్ష్మనాయక్ పేర్కొన్నారు. బుధవారం కోటంక గ్రామంలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను విజయవాడ నుంచి వచ్చిన ఆర్‌వైఎస్ఎస్ సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్‌వైఎస్ఎస్ ఈడీ నీరజ సమక్షంలో జీవామృతం, బీజా మృతం, సీడ్ పెల్లటిజేషన్ ఇన్పుట్స్ ప్రిపరేషన్ చేశారు. సేంద్రియ ఎరువులతో కలిగే ఉపయోగాలు గురించి వివరించారు. అనంతరం గ్రామంలో రైతులు సాగు చేసిన ఏటీఎం మోడల్స్, ఏ గ్రేట్ మోడల్, క్యాస్టర్ మోడళ్లను పరిశీలించారు. కార్య క్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ నవీన్, సిబ్బంది నందిని, అల్లిపీర, వెంకటరామిరెడ్డి, కార్తికేయ, చంద్రశేఖర్, చిరంజీవి ,రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయ వనరులు పెంచాలి


చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

యల్లనూరు: తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచాలని జెడ్పీ సీఈఓ శివశంకర్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన యల్లనూరు మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని ఉద్యోగుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఎన్‌కే కాల్వ రోడ్డులోని డ్రైనేజీని మెరుగురుపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణసాగర్, డిప్యూటీ ఎంపీడీఓ మనోహర్, ఏఓ వాసుదేవరెడ్డి, ఏపీఓ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సిడిమాను ఉత్సవంలో భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు చంద్రానాయక్

బెళుగుప్ప తండాలో సిడిమాను ఉత్సవం

బెళుగుప్ప: బెళుగుప్పతండాలో బుధవారం గౌరసంద్రం మారెమ్మ జాతరలో భాగంగా సిడిమాను ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం అనంతరం అర్చకుడు చంద్రానాయక్ సిడిమానుపై తిరుగుతూ భక్తులపై పూలను చల్లి ఆశీర్వదించారు.


లడ్డూలతో దర్శనమిస్తున్న రామలింగేశ్వరుడు

1116 లడ్డూలతో అభిషేకం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరస్వామికి బుధవారం 1,116 లడ్డూలతో అభిషేకం చేశారు. భాద్రపద మాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లడ్డూలతో అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.